Neti Velugu నేటి వెలుగు

నేటి సమాజం... నేటి వెలుగు...

తెలుగు దినపత్రిక

RNI NO. TELTEL/2023/88559

www.epaper.netivelugu.com

netivelugu63@gmail.com

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది.. ఐడీబీఐ వాటాల విక్రయంపై రాహుల్‌కు నిర్మలా కౌంటర్ 2



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 196 | పేజీలు : 8 | అక్టోబర్ 31 శనివారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 196 | PAGES:8 | SATURDAY OCTOBER 31 2026 | Rs. 4:00

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

- నగరాభివృద్ధికి రూ.84,790 కోట్లతో సమగ్ర కార్యాచరణ
- మూసీ పునరుజ్జీవనం, ట్రిపుల్ ఆర్, ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్‌కు కొత్త రూపు
- రియల్ ఎస్టేట్ రంగం రాష్ట్ర ప్రగతిలో భాగస్వామి కావాలి
- నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 30

హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలకు దీటుగా తీర్చిదిద్దడంతో పాటు, తెలంగాణను దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నగరాభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల పాత్ర అత్యంత కీలకమని, ఈ రంగంలో ఉన్నవారిని కేవలం వ్యాపారవేత్తలుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా ప్రభుత్వం గుర్తిస్తోందని అన్నారు. హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌కు దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే అనేక అనుకూలతలు ఉన్నాయని, మోస్ట్ లివబుల్ సిటీగా గుర్తింపు పొందిన ఈ నగరంలో స్థిరపడేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు కల్పించిన మౌలిక సదుపాయాలను మరింత విస్తరిస్తూ ప్రస్తుత ప్రభుత్వం నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఈసీఐఎల్, డీఆర్‌డీఓ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, ఐఐటీ, ఐఐఐటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు నగర అభివృద్ధికి బలమైన పునాదులుగా నిలిచాయని పేర్కొన్నారు.



రూ.84,790 కోట్లతో నగరాభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

హైదరాబాద్ నగరంతో పాటు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం సుమారు రూ.84,790 కోట్లతో భారీ కార్యాచరణను రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇందులో ఇప్పటికే సుమారు రూ.55 వేల కోట్ల పనులకు సంబంధించి డిజైన్లు, టెండర్ల ప్రక్రియ చేపట్టడంతో పాటు పలు పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. రానున్న రోజుల్లో నగరంలోని ప్రతి ప్రాంతంలో అభివృద్ధి పనులు, నిర్మాణ కార్యక్రమాలు కనిపిస్తాయని చెప్పారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్, మెట్రో రైలు తదితర మౌలిక సదుపాయాల కోసం రూ.52,706 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు రూ.15,849 కోట్లు కేటాయించి పనులు ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ (మిగతా 2వ పేజీలో..)

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం: సీఎం రేవంత్ రెడ్డి



మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు (మిగతా 2వ పేజీలో..)

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్‌ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత



- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తెలంగాణ రక్షణ సేన
- హైదరాబాద్ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు ఖరారు
- వరంగల్, హైదరాబాద్ రెండు స్థానాల్లోనూ బీసీలకే అవకాశం
- ఎన్నికల పరిశీలకుడిగా డాక్టర్ చిట్నేని రఘు నియామకం

రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత తమ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా ప్రముఖ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును ప్రకటించారు. సుమారు 20 ఏళ్లుగా జాతీయ మీడియా రంగంలో పనిచేస్తున్న ఆకాశ్ కొల్లూరు... ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డైలీ హంట్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. విద్యావంతుడు, జాతీయ మీడియా అనుభవం ఉన్న బీసీ నేత కావడంతో పట్టభద్రుల మద్దతు తమకే లభిస్తుందని టీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే వరంగల్ – ఖమ్మం – నల్గొండ స్థానం (మిగతా 2వ పేజీలో..)

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు

మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ



ప్రక్షాళన పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలో విపక్షాలు తలపెట్టిన 'మాక్ పార్లమెంట్'పైనా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యూపీఏ హయాంలో ములాయం సింగ్ (మిగతా 2వ పేజీలో..)

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. నగర జీవనం అస్తవ్యస్తం

- హైదరాబాద్‌ను ముంచెత్తిన కుండపోత వర్షం
- ప్రధాన రహదారులన్నీ జలమయం
- పలు ప్రాంతాల్లో గంటల తరబడి నిలిచిపోయిన ట్రాఫిక్



ఇళ్లకు వెళ్లే వేళ ఉద్యోగులు, ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు

ఎండ వేడిమి నుంచి నగరవాసులకు ఊరట

శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వానతో నగర జీవనం అస్తవ్యస్తంగా మారింది. గంటకు పైగా ఏకధాటిగా వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. నగరంలోని ఖైరతాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ, అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్ వంటి ప్రధాన ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా వరద నీరు చేరింది. దీంతో ఆఫీసుల (మిగతా 2వ పేజీలో..)

కొలువు కోసం సైగలతో దివ్యాంగుడి మొర.. 24 గంటల్లో ఉద్యోగం కల్పించిన సీఎం విజయ్

- ఉద్యోగం కోరుతూ సైగలతో విన్నవించుకున్న దివ్యాంగ యువకుడు
- తక్షణమే స్పందించి హామీ ఇచ్చిన తమిళనాడు సీఎం విజయ్
- కేవలం 24 గంటల్లోనే ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తూ ఉత్తర్వులు

(మిగతా 2వ పేజీలో..)





నేటి వెలుగు
నేటి సమాజం... నేటి తెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం: సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే. ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు

(మొదటి పేజీ తరువాయి)

యాదవ్ నాయకత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే, దాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సోనియా గాంధీ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ మీరా కుమార్ విషయాన్ని ప్రస్తావిస్తూ... ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలు రాజకీయ స్వలాభం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. నగర జీవనం అస్తవ్యస్తం

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం రద్దీ సమయం కావడంతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపయ్యాయి.ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో పరిస్థితి తీవ్రంగా మారింది. మాదాపూర్, హైటెక్‌సిటీ, కేపీహెచ్‌బీ, మైండ్‌స్పేస్, ఐకియా మార్గాల్లో వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. మాదాపూర్ సిటీ వైస్ వద్ద ప్రధాన రహదారి చెరువును తలపించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కుత్బుల్లాపూర్ నుంచి సూరారం వరకు, షాపూర్ నుంచి గాజులరామారం వరకు కూడా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వర్షానికి తడుస్తూ కొందరు ప్రయాణికులు మెట్రో పిల్లర్ల కింద తలదాచుకోగా, మరికొందరు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోయారు. ఉప్పల్, ఎల్బీనగర్, మణికొండ, రాయదుర్గం, రాజేంద్రనగర్ వంటి నగర శివారు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. అయితే, గత కొన్ని రోజులుగా నగరంలో తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది.

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్‌ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత

(మొదటి పేజీ తరువాయి)

నుంచి బీసీ వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను టీఆర్ఎస్ బరిలో దింపిన సంగతి తెలిసిందే. తాజా ప్రకటనతో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీలనే నిలబెట్టినట్లయింది. ఈ ఎన్నికల కోసం హైదరాబాద్ స్థానానికి అబ్జర్వర్‌గా డాక్టర్ చిట్నేని రఘును... రెండు నియోజకవర్గాల ఎన్నికల వ్యూహాలు, వార్ రూమ్ ఇన్‌చార్జ్‌గా న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాను నియమిస్తూ కవిత నిర్ణయం తీసుకున్నారు.

కొలువు కోసం సైగలతో దివ్యాంగుడి మొర.. 24 గంటల్లో ఉద్యోగం కల్పించిన సీఎం విజయ్

(మొదటి పేజీ తరువాయి)

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ఓ దివ్యాంగ నిరుద్యోగి పట్ల మానవతా దృక్పథంతో స్పందించారు. ఉద్యోగం ఇప్పించాలని సైగలతో వేడుకున్న యువకుడికి కేవలం 24 గంటల్లోనే ప్రభుత్వ ఉద్యోగం కల్పించి తన హామీని నిలబెట్టుకున్నారు. ఇచ్చిన మాటను వెంటనే అమలు చేసిన ఈ ఘటనపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. చెన్నై గిండిలోని ప్రభుత్వ వృత్తివిద్యా శిక్షణ సంస్థలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమానికి సీఎం విజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దినేశ్ అనే దివ్యాంగ యువకుడు సీఎంను కలిసి, తాను నిరుద్యోగినని, జీవనం కష్టంగా ఉందని సైగలతో వివరిస్తూ ఓ వినతిపత్రాన్ని అందించాడు. అతని పరిస్థితిని అర్థం చేసుకున్న విజయ్, తప్పకుండా సాయం చేస్తానని అక్కడికక్కడే భరోసా ఇచ్చారు.అనుకున్నదే తడవుగా, మరుసటి రోజైన గురువారం ఉదయం దినేశ్‌ను సచివాలయానికి పిలిపించారు. అక్కడ సీఎం విజయ్ స్వయంగా దినేశ్‌తో కరచాలనం చేసి, ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. తిరువొత్తియూరులోని ప్రభుత్వ శిక్షణ కేంద్రంలో సహాయకుడి పోస్టును కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.విజ్ఞప్తి చేసిన ఒక్క రోజులోనే ఉద్యోగం రావడంతో దినేశ్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తన కష్టాన్ని అర్థం చేసుకుని తక్షణమే స్పందించిన సీఎం విజయ్‌కు అతడు కృతజ్ఞతలు తెలిపాడు. ప్రజాప్రతినిధులు సమస్యలపై వెంటనే స్పందించాలనడానికి ఈ ఘటన ఒక ఉదాహరణగా నిలిచింది.

హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.4 వేల కోట్లు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,500 కోట్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.2,163 కోట్లు, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రహదారుల అభివృద్ధికి రూ.500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వివరించారు.

మూసీ పునరుజ్జీవనంతో నగరానికి కొత్త ఆభరణం

మూసీ నదిని మురికి కూపం నుంచి స్వచ్ఛమైన జలాలతో ప్రవహించే నదిగా మార్చి హైదరాబాద్‌కు గొప్ప ఆస్తిగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పమని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన నగరాలు తమ మధ్యలో ప్రవహించే నదులను శుద్ధి చేసి పర్యాటక, ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేసుకున్నాయని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో మూసీ పునరుజ్జీవన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా తొలి దశలో సుమారు రూ.7,500 కోట్ల పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని చెప్పారు. మూసీలోకి మురుగునీరు చేరకుండా నగరంలోని 21 ప్రధాన నాలాల వద్ద ఒకేసారి మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి, టెండర్ల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఎస్టీపీల సంఖ్యను 38కు పెంచే ఆలోచన ఉందన్నారు. శుద్ధి చేసిన నీటిని పారిశ్రామిక అవసరాలు, ఉద్యానవనాల నిర్వహణకు వినియోగించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. మూసీ నది భవిష్యత్తులో హైదరాబాద్‌కు అతిపెద్ద ఆభరణంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

భారత్ ఫ్యూచర్ సిటీతో అభివృద్ధికి నూతన దిశ

సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఇందులో 15 వేల ఎకరాలను పచ్చదనం, విశాలమైన బహిరంగ ప్రదేశాల కోసం కేటాయించడం విశేషమన్నారు. మొత్తం భూభాగంలో 50 శాతం గ్రీన్ స్పేస్‌గా ఉంచుతూ నగర నిర్మాణం చేపట్టడం దేశంలోనే ప్రత్యేకతగా నిలుస్తుందని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా భారత్ ఫ్యూచర్ సిటీ మరో కీలక అభివృద్ధి కేంద్రంగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. ట్రిపుల్ ఆర్, మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు హైదరాబాద్ భవిష్యత్తును మార్చనున్నాయని తెలిపారు. నగరాభివృద్ధికి అవసరమైన నీటి వనరుల విషయంలోనూ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, కృష్ణా, గోదావరి జలాలను నగరానికి తీసుకువచ్చే ప్రణాళికలు హైదరాబాద్ విస్తరణకు దోహదపడ్డాయని గుర్తుచేశారు.

కాలుష్య నియంత్రణకు హిల్ట్ పాలసీ

హైదరాబాద్‌ను స్వచ్ఛమైన, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు హిల్ట్ పాలసీని తీసుకొచ్చినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పరిశ్రమలను దశలవారీగా బయటకు తరలించడం ద్వారా నగరంలో కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రజా రవాణాలో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడంతో పాటు, ఆటోలను కూడా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు సబ్సిడీతో కూడిన సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక రవాణా వ్యవస్థల సమన్వయంతో హైదరాబాద్‌ను మరింత నివాసయోగ్యమైన నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి రూ.93 వేల కోట్లు

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను మెరుగుపరిచేందుకు సుమారు రూ.93 వేల కోట్లతో రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. నాలుగు వరుసల రహదారులు, ఫ్లైఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. నగరాభివృద్ధితో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు భారీ మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు వెచ్చిస్తూనే మరోవైపు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని భట్టి విక్రమార్క వివరించారు. రాష్ట్రంలో 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, అర్హులైన కుటుంబాలకు రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 41 లక్షల కుటుంబాలకు చేయూత పథకం ద్వారా ప్రయోజనాలు అందిస్తున్నామని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణాలను చేపడుతున్నామని తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం అందించేందుకు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లోకి నేరుగా నిధులు బదిలీ చేస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, అది తిరిగి వ్యాపార, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు.

నిర్మాణ రంగానికి అవసరమైన నైపుణ్య మానవ వనరులు

రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనతో ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి తరగతులు కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్ రూపొందించడం, శిక్షణ ఇచ్చే అధ్యాపకులను ఎంపిక చేయడం వంటి బాధ్యతలను పరిశ్రమల ప్రతినిధులకే అప్పగించినట్లు చెప్పారు. శిక్షణ పూర్తిచేసిన యువతకు పరిశ్రమల్లోనే ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా వినూత్న విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని, ఆధునిక యంత్రాలు, నిర్మాణ రంగ సాంకేతికతలపై యువతకు శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, ప్రతిభ కలిగిన యువతను ప్రభుత్వమే శిక్షణ ఇచ్చి అందించేందుకు సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. నగరంలో లగ్జరీ గృహాలతో పాటు పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో ఇళ్లు నిర్మించే అంశంపై కూడా దృష్టి సారించాలని పరిశ్రమ వర్గాలకు సూచించారు. గతంలో హౌసింగ్ బోర్డు ద్వారా నిర్మించిన ఎంఐజీ, ఎల్ఐజీ గృహాలు అనేక కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చాయని గుర్తుచేశారు. అదే తరహాలో దీర్ఘకాలిక ప్రణాళికతో అందుబాటు గృహ నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణంలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగ ప్రతినిధులు భాగస్వాములై సంపద సృష్టికర్తలుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విధానాలు, భారీ మౌలిక సదుపాయాల పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాల సమన్వయంతో హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా, తెలంగాణను దేశంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది.. ఐడీబీఐ వాటాల విక్రయంపై రాహుల్‌కు నిర్మలా కౌంటర్

ఐడీబీఐ వాటాల విక్రయాన్ని సమర్థించిన నిర్మలా సీతారామన్

కాంగ్రెస్ హయాంలో రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపణ

మొండి బకాయిలపై గత ప్రభుత్వాలను విమర్శించిన మంత్రి

రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం చేశామని వెల్లడి

విక్రయ ప్రక్రియలో నిబంధనలు పాటించామని స్పష్టీకరణ

ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. ఈ విక్రయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ఆమె స్పందించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇప్పించాయని ఆరోపించారు. వాటి ఫలితంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా మొండి బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు.బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కాంగ్రెస్ నేతలు తమ సొంత సంస్థల్లా వాడుకున్నారని నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తమకు నచ్చిన సంస్థలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం.. సంజయ్ గాంధీ వర్గానికి సంబంధమున్న సంస్థకు రుణాల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ఎస్‌బీఐ ఛైర్మన్ ఆర్.కె. తల్వార్‌ను పదవి నుంచి తొలగించిందని గుర్తుచేశారు. మారుతి సంస్థకు రుణాల విషయంలోనూ 'సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'పై సంజయ్ గాంధీ ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు.ఐడీబీఐ బ్యాంక్ గతంలో తీవ్ర సమస్యల్లో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. వీడియోకాన్, విన్‌సమ్, ఏబీజీ షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ వంటి పెద్ద సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారి బ్యాంకుకు భారీ నష్టాలు తెచ్చాయని తెలిపారు. ఈ సంస్థలకు కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వృత్తిపరమైన నిర్వహణ, జాగ్రత్తతో కూడిన రుణ విధానాలు, రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం ద్వారా బ్యాంకును తిరిగి గాడిలో పెట్టిందని చెప్పారు. ఐడీబీఐ పునర్వ్యవస్థీకరణలో అన్ని నిబంధనలను పాటించామని స్పష్టం చేశారు.2024 ఫిబ్రవరిలో కేంద్రం విడుదల చేసిన భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రంలో గత ప్రభుత్వాల హయాంలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకల వివరాలు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో.. పలుకుబడి ఉన్నవారికి ఒక రకంగా, సామాన్యులకు మరో రకంగా బ్యాంకింగ్ సేవలు అందేవని విమర్శించారు.ఈ నెల 14న ఐడీబీఐ బ్యాంకులో 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు సుమారు రూ.53 వేల కోట్లకు విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా నిలవనుంది. ఈ నిర్ణయాన్ని రాహుల్ గాంధీ విమర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులను ఏర్పాటు చేస్తే, మోదీ ప్రభుత్వం వాటిని విక్రయిస్తోందని వ్యాఖ్యానించారు. ఐడీబీఐ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.



20 ఏళ్ల యువతికి బ్రెయిన్ స్ట్రోక్.. యశోదా వైద్యుల అధునాతన చికిత్సతో తప్పిన ప్రాణాపాయం!

- **కుడిచేయి, కాలు చచ్చుబడటం.. అకస్మాత్తుగా మాట కోల్పోవడం**
- **మెదడులో 5 మి.మీ. మిడ్‌లైన్ షిఫ్ట్.. పాటాషియం తీవ్ర లోపంతో సంక్లిష్టంగా మారిన పరిస్థితి**

నల్గొండ అక్టోబర్ 30 నేటి వెలుగు ప్రతినిధి

చిన్న వయసులోనే బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడిన 20 ఏళ్ల యువతికి హైదరాబాద్ మలక్‌పేట యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు అధునాతన వైద్య చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి గట్టెక్కించారు. అకస్మాత్తుగా మాట కోల్పోవడంతో పాటు కుడిచేయి, కుడికాలు కదలకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు యువతిని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు నిర్వహించిన బ్రెయిన్ స్కానింగ్‌లో ఎడమ యాంటీరియర్ సెరిబ్రల్ ఆర్టరీ పరిధిలో తీవ్రమైన అక్యూట్ ఇస్కీమిక్ స్ట్రోక్ ఉన్నట్లు గుర్తించారు. మెదడులోని ఫ్రంటోపారియటల్ ప్రాంతంలో ఇన్‌ఫార్క్ట్ ఏర్పడి, దాని ప్రభావంతో మెదడు మధ్యరేఖ కుడివైపునకు 5 మిల్లీమీటర్లు మారినట్లు నిర్ధారించారు. ప్రారంభ పరీక్షల్లో యువతి కుడిచేయి, కుడికాలి కండరాల శక్తి 0/5గా నమోదు కావడంతో పాటు మాట పలకలేని అఫేసియా సమస్య ఉన్నట్లు గుర్తించారు.దీంతో న్యూరో ఐసీయూలో నిరంతర పర్యవేక్షణలో ఉంచి చికిత్స ప్రారంభించారు. న్యూరోసర్జన్ పరిశీలన అనంతరం శస్త్రచికిత్స అవసరం లేదని నిర్ణయించి, మందులు మరియు ఇతర వైద్య పద్ధతులతో కన్జర్వేటివ్ మెడికల్ మేనేజ్‌మెంట్ చేపట్టారు.ఇదిలా ఉండగా, యువతికి రక్తంలో పొటాషియం స్థాయి అత్యంత ప్రమాదకరంగా లీటరుకు 1.8 మిల్లీమోల్స్‌కు పడిపోవడం, అధిక రక్తపోటు నియంత్రణలో ఇబ్బందులు, సోడియం స్థాయుల్లో హెచ్చుతగ్గులు కనిపించడంతో వైద్యులకు మరింత సవాలుగా మారింది. న్యూరాలజీ, క్రిటికల్ కేర్, నెఫ్రాలజీ, ఎండోక్రైనాలజీ విభాగాల నిపుణులు సమన్వయంతో చికిత్స అందించారు. హార్మోన్ల సంబంధిత సమస్యలపై ప్రత్యేక పరీక్షలు నిర్వహించినప్పటికీ కంజెనిటల్ అడ్రినల్ హైపర్‌ప్లాసియా, 17-ఆల్ఫా హైడ్రాక్సిలేస్ డెఫిషియెన్సీ నిర్ధారణ కాలేదు.ఈ సందర్భంగా కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్ డా. సూరిశెట్టి భరత్ కుమార్ మాట్లాడుతూ.. చిన్న వయసులో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినప్పుడు ఇతర అంతర్లీన ఆరోగ్య సమస్యలను కూడా సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు. తీవ్రమైన స్ట్రోక్‌తో పాటు రక్తపోటు, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత ఉండటంతో వివిధ విభాగాల వైద్య నిపుణుల సమన్వయంతో చికిత్స అందించినట్లు వివరించారు.కన్సల్టెంట్ ఎండోక్రైనాలజిస్ట్ డా. జయాదిత్య ఘోష్ మాట్లాడుతూ.. ఇటువంటి సంక్లిష్ట కేసుల్లో అనుమానిత హార్మోన్ల సమస్యలపై మరిన్ని పరీక్షలు అవసరమని పేర్కొన్నారు. సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా. బి. గేయానంద్ సుధీర్ మాట్లాడుతూ.. బ్రెయిన్ స్కానింగ్ ఫలితాలను పరిశీలించిన అనంతరం శస్త్రచికిత్సకు బదులుగా కన్జర్వేటివ్ మెడికల్ మేనేజ్‌మెంట్‌ను సూచించినట్లు తెలిపారు.వైద్యుల నిరంతర పర్యవేక్షణ, సమగ్ర చికిత్సతో యువతి ఆరోగ్య పరిస్థితి సంతృప్తికరంగా మెరుగుపడటంతో హీమోడైనమికల్‌గా స్థిరమైన స్థితిలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. తదుపరి న్యూరలాజికల్ ఫాలోఅప్ కొనసాగించాలని వైద్యులు సూచించారు. యశోదా ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ శ్రీనివాస్ చిదుర మాట్లాడుతూ.. వివిధ విభాగాల వైద్య నిపుణుల సమన్వయంతో అత్యంత సంక్లిష్టమైన వైద్య కేసులకు సమగ్ర చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ వాస్ కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



హాలియా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ






- **పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి.. నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి**
- **పోలీస్ సిబ్బందికి ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశాలు**

హాలియా అక్టోబర్ 30 నేటి వెలుగు :

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడికి మెరుగైన సేవలు అందించాలని, పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు.హాలియా పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని విధులు, నిర్వహణ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పోలీస్ సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదుదారులకు అందుతున్న సేవలు, సిబ్బంది స్పందిస్తున్న తీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సీసీ కెమెరాల పనితీరును సమీక్షించారు.పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించిన ఎస్పీ.. ప్రతి కేసులో నిర్దిష్ట గడువులోగా దర్యాప్తు పూర్తి చేయాలని, నాణ్యమైన సాక్ష్యాధారాలను సేకరించి నిందితులకు చట్టప్రకారం శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితులకు న్యాయం అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనిస్తూ నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి, వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ దొంగతనాలు, ఇతర నేరాలను అరికట్టాలని సూచించారు.ప్రజలతో పోలీస్ సిబ్బంది స్నేహపూర్వకంగా వ్యవహరించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా విని చట్టపరిధిలో పరిష్కరించాలని తెలిపారు. గ్రామాల్లో తరచూ పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ అంకితభావంతో పనిచేయాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశించారు.ఈ తనిఖీలో మిర్యాలగూడ ఇన్‌చార్జి డీఎస్పీ రవి, హాలియా సీఐ రాఘవరావు, ఎస్ఐ సాయి ప్రశాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ





ప్రత్యేక కోర్సుల రూపకల్పనకు చర్యలు చేపట్టాలి
జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 30 నేటి వెలుగు:

జిల్లాలోని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను సర్వే ద్వారా గుర్తించి, వాటికి అనుగుణంగా ప్రత్యేక శిక్షణ కోర్సులను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.ఎన్ఐఈఎల్ఐటీ, ఆర్‌సెట్టి, సీఐటీడీ, టాస్క్ తదితర సంస్థల సమన్వయంతో యువతకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు. స్థానిక పరిశ్రమలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు.టాస్క్ సమన్వయంతో జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని కలెక్టర్ వెల్లడించారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే నిరుద్యోగ యువతకు విస్తృత స్థాయిలో నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.యువతలో ఉన్న నైపుణ్యాలను గుర్తించి, పరిశ్రమలకు అవసరమైన శిక్షణ అందించడం ద్వారా ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో డీఆర్వో డి. ప్రేమ్ రాజు, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఎం.ఎ. భారతి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సత్యనారాయణ రెడ్డి, ఎన్ఐఈఎల్ఐటీ ప్రతినిధి డాక్టర్ లక్ష్మణ్, ఎన్ఎస్‌డీసీ ప్రతినిధి ప్రతాప్ చారి, ఎస్‌బీఐ ప్రతినిధి వాల్యా నాయక్, సూర్యాపేట పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ లెక్చరర్ వజ్రయ్య, హుజూర్‌నగర్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎన్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదులో అక్రమాలకు చెక్!

- **తప్పుడు ధ్రువపత్రాలు సమర్పిస్తే చట్టపరమైన చర్యలు**
- **పారదర్శకంగా నమోదు ప్రక్రియ చేపట్టాలి : రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అక్టోబర్ 30 నేటి వెలుగు:



పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు, పొరపాట్లకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓటరు నమోదుకు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.శుక్రవారం అల్వాల్ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ఓటర్ల నమోదు పురోగతిని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓ లు) నమోదు ప్రక్రియలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించి, వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణలో వేగం పెంచడంతో పాటు ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించాలని ఆదేశించారు.ముఖ్యంగా దరఖాస్తుదారులు సమర్పించే ఫారం--18, డిగ్రీ సర్టిఫికెట్లు, ఇతర విద్యార్హత ధ్రువపత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే ఓటరు నమోదుపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. అర్హత లేని వ్యక్తులు తప్పుడు ధ్రువపత్రాలతో ఓటరు జాబితాలో చేరేందుకు ప్రయత్నిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.పట్టభద్రుల ఓటర్ల జాబితా నిష్పక్షపాతంగా, విశ్వసనీయంగా ఉండేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సుదర్శన్ రెడ్డి సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మల్కాజిగిరి ఆర్డీఓ శ్యాంప్రకాష్, అల్వాల్ ఎంఆర్ఓ రాములు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదులో న్యాయవాదులు చొరవ చూపాలి

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర మరువలేనిది
మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



నల్లగొండ జిల్లా అక్టోబర్ 30 నేటి వెలుగు:



ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమని, ఉద్యమకారులకు న్యాయ సహాయం అందిస్తూ ఉద్యమానికి అండగా నిలిచిన ఘనత న్యాయవాదులకే దక్కుతుందని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు.నేడు నల్లగొండ జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు ఉద్యమానికి ఎప్పటికప్పుడు న్యాయ సలహాలు అందిస్తూ ముందుకు నడిపించారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేకమంది ఉద్యమకారులు కేసులు ఎదుర్కొన్నప్పుడు న్యాయవాదులు ఉచితంగా న్యాయ సహాయం అందించారని కొనియాడారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల తెలంగాణలోని వివిధ వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కంచర్ల భూపాల్ రెడ్డి విమర్శించారు. మేధావులైన న్యాయవాదులు ప్రజలకు వాస్తవ పరిస్థితులను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులైన పట్టభద్రులను కూడా ఓటర్లుగా నమోదు చేయించాలని విజ్ఞప్తి చేశారు.గతంలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైనప్పటికీ ఏనుగుల రాకేష్ రెడ్డి నిరంతరం యువత, నిరుద్యోగులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా తిరిగి పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆయనకు న్యాయవాదులు సహకరించాలని కోరారు. ముందుగా తమ పరిధిలోని పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు అయ్యేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని, వారికి అండగా ఉంటానని కంచర్ల భూపాల్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. సతీష్ కుమార్, కార్యదర్శి అశోక్, సీనియర్ న్యాయవాదులు గుండె వెంకటేశ్వర్లు, మునగాల నారాయణరావు, జి. జవహర్, సిరిగిరి వెంకట్ రెడ్డి, లోడంగి గోవర్ధన్, కంచనపల్లి రవీందర్ రావు, యడవెల్లి సింగిల్ విండో చైర్మన్ దోటి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస రెడ్డి, న్యాయవాదులు యాదగిరి, ప్రవీణ్ కుమార్, ఎ. వెంకట్ రెడ్డి, మంద నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మణ వెల్లంల--ఉదయ సముద్రం కాలువ పనులు వేగవంతం చేయాలి

ఇరిగేషన్ అధికారులతో సమీక్షించిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
రైతులకు సాగునీరు అందించేందుకు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచన

చిట్యాల అక్టోబర్ 30 నేటి వెలుగు ప్రతినిధి:



బ్రహ్మణ వెల్లంల--ఉదయ సముద్రం కాలువ పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు.శుక్రవారం చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలోని తన నివాసంలో బ్రహ్మణ వెల్లంల--ఉదయ సముద్రం కాలువ పనుల పురోగతిపై సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఈ, డీఈ, ఈఈ, ఎస్ఈ తదితర అధికారులను పనుల ప్రస్తుత స్థితిగతులు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, మిగిలి ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పనుల వేగవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కాలువ పనుల పూర్తిలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యం ఉండకూడదని, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని గుత్తా సుఖేందర్ రెడ్డి కోరారు.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

మిర్యాలగూడలో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు

- రైస్ మిల్లులు, బియ్యం దుకాణాల్లో 8 కేసులు నమోదు -- తూకంలో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు



మిర్యాలగూడ పట్టణం అక్టోబర్ 30 నేటి వెలుగు :



పట్టణంలోని రైస్ మిల్లులు, బియ్యం విక్రయ దుకాణాల్లో లీగల్ మెట్రాలజీ (తూనికలు, కొలతల శాఖ) అధికారులు తనిఖీలు నిర్వహించారు. అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ, నల్గొండ పర్యవేక్షణలో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఈ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఐదు రైస్ మిల్లులు, మూడు రిటైల్ బియ్యం విక్రయ దుకాణాలను పరిశీలించారు. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 8 కేసులు నమోదు చేశారు. వీటిలో ఐదు కేసులు రైస్ మిల్లులపై, మూడు కేసులు బియ్యం దుకాణాలపై నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

బియ్యం కొనుగోలులో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

బియ్యం కొనుగోలు చేసే సమయంలో బస్తాపై ప్రకటించిన నికర బరువును తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులు సూచించారు. బస్తాతో సహా మొత్తం బరువును మాత్రమే కాకుండా, ఖాళీ బస్తా బరువును మినహాయించి బియ్యం నికర బరువు ప్రకటించిన పరిమాణంలో ఉందో లేదో తూకం వేయించి నిర్ధారించుకోవాలని తెలిపారు. తూకంలో తేడాలు లేదా ఇతర నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినట్లయితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని వినియోగదారులకు సూచించారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు

వ్యాపారులందరూ తూనికలు, కొలతల చట్టం మరియు ప్యాకేజ్డ్ కమోడిటీస్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

9వ నెలలోనూ సమంత వర్కౌట్లు.. ప్రెగ్నెన్సీ ఫిట్‌నెస్ జర్నీ వీడియో వైరల్!

- తొమ్మిదో నెల గర్భంతో ఉన్న నటి సమంత
- తన ఫిట్‌నెస్ జర్నీని చూపిస్తూ సోషల్ మీడియాలో వీడియో షేర్
- '9. ది ఫైనల్ ల్యాప్' అంటూ పోస్ట్ చేసిన సామ్
- శరీరం చెప్పేది వింటూ వర్కౌట్లు చేస్తున్నానన్న సమంత

ప్రముఖ నటి సమంత ప్రస్తుతం తన ప్రెగ్నెన్సీలో చివరి దశను ఆస్వాదిస్తున్నారు. త్వరలోనే పండంటి బిడ్డకు జన్మనివ్వబోతున్న ఆమె, గర్భంతో ఉన్నప్పటికీ తన ఫిట్‌నెస్ పట్ల ఏమాత్రం రాజీ పడటం లేదు. తాజాగా తొమ్మిదో నెలలోకి అడుగుపెట్టిన సందర్భంగా తన గర్భధారణ ప్రయాణంలో ఫిట్‌నెస్ ఎంత ముఖ్యమో తెలియజేస్తూ ఒక స్ఫూర్తిదాయక వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'చ9. ది ఫైనల్ ల్యాప్' (చివరి అంకం) అనే క్యాప్షన్‌తో ఆమె చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఈ వీడియోలో సమంత తన గర్భం దాల్చిన మొదటి నెల నుంచి తొమ్మిదో నెల వరకు వివిధ దశల్లో చేసిన వర్కౌట్లను చూపించారు. ముఖ్యంగా, లేటెస్ట్ క్లిప్‌లో ఆమె ఛాతీకి దగ్గరగా డంబెల్ పట్టుకుని వెయిటెడ్ స్క్వాట్స్ చేయడం అందరినీ ఆకట్టుకుంటోంది. గర్భం కారణంగా తన శరీరం మార్పులకు అనుగుణంగా వ్యాయామ దినచర్యను ఎలా మార్చుకున్నారో సమంత గతంలోనే వివరించారు."ఈ రోజుల్లో ట్రైనింగ్ కాస్త భిన్నంగా ఉంది. ఎక్కువగా శ్రమించడం కంటే, శరీరం చెప్పేది వినడంపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నాను" అని ఆమె గతంలో ఒక వర్కౌట్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు ఆమె షేర్ చేసిన వీడియో కూడా అదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.కాగా, సమంత తన భర్త, ప్రముఖ ఫిల్మ్‌మేకర్ రాజ్ నిడిమోరుతో కలిసి తమ తొలి బిడ్డకు స్వాగతం పలకనున్నారు. కొద్ది వారాల క్రితం, ఈ జంట కోయంబత్తూరులోని సద్గురు ఈశా ఫౌండేషన్‌లో తమ కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య సంప్రదాయబద్ధంగా సీమంతం వేడుకను జరుపుకున్నారు. సమంత, రాజ్ 2025 డిసెంబర్‌లో ఇదే ఈశా యోగా సెంటర్‌లోని లింగ భైరవి ఆలయంలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సమంత పోస్ట్‌పై నటి కృతి కర్బందా స్పందిస్తూ.. "మీ ముగ్గురికీ నా ప్రేమ" అంటూ కామెంట్ చేశారు. సమంత ఫిట్‌నెస్ స్ఫూర్తిపై అభిమానులు, తోటి నటీనటులు ప్రశంసలు కురిపిస్తున్నారు. గర్భంతో ఉన్నప్పటికీ చురుకుగా ఉంటూ ఎంతో మందికి ఆమె ఆదర్శంగా నిలుస్తున్నారు.



నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు!





- కూకట్‌పల్లిలో వైద్య సంస్థలపై డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీలు
- ట్రిశూల్ డయాగ్నస్టిక్స్, వీఎంఆర్ ఆసుపత్రుల్లో స్కానింగ్ యంత్రాలు సీజ్
- గెలాక్సీ లేజర్ సర్జరీ ఆసుపత్రికి షోకాజ్ నోటీసు

కూకట్‌పల్లి అక్టోబర్ 30 నేటి వెలుగు:

పజారోగ్యం, రోగుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. వైద్య రంగంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ హెచ్చరించారు. శుక్రవారం కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లోని పలు వైద్య సంస్థల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లు, అనుమతులు, వైద్య పరికరాల వినియోగం, సిబ్బంది వివరాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలను పరిశీలించారు.

ట్రిశూల్ డయాగ్నస్టిక్స్‌లో పలు లోపాలు

కూకట్‌పల్లిలోని ట్రిశూల్ డయాగ్నస్టిక్స్ ప్రాంగణంలో నిర్వహించిన తనిఖీల్లో మెడికో కాస్మెటిక్ సర్జరీ క్లినిక్ పేరుతో ఉన్న అనుమతులకు, ట్రిశూల్ పేరుతో నిర్వహిస్తున్న డయాగ్నస్టిక్ సేవలకు మధ్య వ్యత్యాసాలను అధికారులు గుర్తించారు. సిబ్బంది వివరాలు, కాలుష్య నియంత్రణ, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన పత్రాల్లోనూ లోపాలు ఉన్నట్లు గుర్తించారు. అక్కడ టీఎంటీ, ఈసీజీ పరీక్షలతో పాటు అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే యంత్రాలు ఉన్నట్లు పరిశీలనలో వెల్లడైంది. పీసీపీఎన్‌డీటీ చట్టానికి సంబంధించిన నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని అధికారులు సీజ్ చేశారు.

గెలాక్సీ ఆసుపత్రికి షోకాజ్ నోటీసు

గెలాక్సీ లేజర్ సర్జరీ ఆసుపత్రిలో నిర్వహించిన తనిఖీల్లో తాత్కాలిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ గడువు 2026 ఏప్రిల్ 23తో ముగిసినట్లు గుర్తించారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన పూర్తి పత్రాలను సమర్పించకపోవడంతో పాటు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలు, రోగులకు అందుబాటులో ఉంచాల్సిన చికిత్సా ధరల పట్టిక వంటి అంశాల్లో లోపాలను గుర్తించారు. దీంతో ఆసుపత్రి యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

వీఎంఆర్ ఆసుపత్రిలోనూ స్కానింగ్ యంత్రం సీజ్

వీఎంఆర్ హాస్పిటల్స్, మెటర్నిటీ (ఓబీజీ) అండ్ సర్జికల్ సెంటర్‌లోనూ అధికారులు తనిఖీలు చేపట్టారు. పీసీపీఎన్‌డీటీ చట్టానికి సంబంధించిన నిబంధనలను పరిశీలించగా, అల్ట్రాసౌండ్ యంత్రంపై స్కానింగ్ కార్యకలాపాలకు సంబంధించి ఉల్లంఘనలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీంతో స్కానింగ్ యంత్రాన్ని సీజ్ చేసి, ఆసుపత్రి యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.



నిబంధనలు పాటించాల్సిందే..

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను నిషేధించే పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని ప్రతి వైద్య సంస్థ తప్పనిసరిగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం అవసరమైన రిజిస్ట్రేషన్, అనుమతులు, సిబ్బంది వివరాలు, ఇతర రికార్డులను నిర్వహించాల్సిన బాధ్యత ఆసుపత్రులపై ఉందన్నారు.రోగులకు అందించే వైద్య సేవలు, చికిత్సా వివరాలు, ధరల పట్టిక పారదర్శకంగా ఉండాలని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వైద్య సంస్థలపై తనిఖీలు కొనసాగుతాయని, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.వైద్య సేవల్లో నిర్లక్ష్యం, అనుమతుల ఉల్లంఘనలు, స్కానింగ్ సేవల్లో అక్రమాలు లేదా ఇతర సమస్యలు ఎదురైతే ప్రజలు ఆధారాలతో సహా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయానికి లిఖితపూర్వకంగా లేదా ఈమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

స్మార్ట్ సిటీలో భాగంగా ఆరులైన్ల రోడ్డు విస్తరణ





- మంత్రి కోమటిరెడ్డి సహకారంతో నల్లగొండలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి
- నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి
- సాగర్ రోడ్డులో వైయస్సార్ విగ్రహం నుంచి చర్లగౌరారం రోడ్డు వరకు ఆరు లైన్ల రోడ్డు విస్తరణకు శంకుస్థాపన
- సంవత్సరంలో నల్లగొండ రూపురేఖలు మారుస్తాం
- ప్రతిపక్షాలు సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని అసత్య ప్రచారాలు
- మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి

నల్లగొండ అక్టోబర్ 30 నేటి వెలుగు ప్రతినిధి:

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో అన్ని డివిజన్లో పార్టీల కతీతంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని నగర మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి గారు అన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి ఆదేశాల మేరకు శుక్రవారం నల్లగొండ పట్టణం సాగర్ రోడ్డు వైయస్సార్ విగ్రహం నుంచి చర్లగౌరారం రోడ్డు వరకు ఆరు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు స్థానిక కార్పొరేటర్, పార్టీ శ్రేణులతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు.రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియడంతో ఇటీవల ఈ రోడ్డును పరిశీలించడం జరిగిందని అన్నారు. డివైడర్, సెంట్రల్ లైటింగ్ లో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఆరు లైన్ల రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికే నల్గొండ పట్టణంలో కోట్లాది రూపాయలతో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రూ. 20 కోట్లు నిధులు మంజూరు చేశారని అన్నారు.పానగల్ నుంచి డీఈఓ ఆఫీస్ వరకు కూడా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. అదేవిధంగా నల్లగొండలో పర్యాటకంగా, ఆధ్యాత్మికంగా మరింత అభివృద్ధి చేసేందుకు బ్రహ్మంగారి గుట్ట, లతీఫ్ సాబ్ గుట్టలకు ఘాట్ రోడ్డు నిర్మించడం జరుగుతుందని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని పేర్కొన్నారు. కార్పొరేషన్ లోని అన్ని డివిజన్లో అభివృద్ధి చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఛాయా సోమేశ్వరాలయం అభివృద్ధికి, సాగర్ రోడ్డు ఆరు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు చేసిన సందర్భంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం, పట్టణ ప్రజల తరపున మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఈ సందర్భంగా మేయర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నల్గొండ మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ పట్టణంలో మంత్రి కోమటిరెడ్డి సహకారంతో రూ.2,000 వేల కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. సాగర్ రోడ్లో వైయస్సార్ విగ్రహం నుంచి చర్లగౌరారం రోడ్డు వరకు మూడున్నర కిలోమీటర్ల ఆరు లైన్ల రోడ్డు విష్కరణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన ఆర్ అండ్ బి శాఖ నుంచి రూ.20 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. నల్లగొండలో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తూ ముందుకు పోతున్నట్లు తెలిపారు. సంవత్సరంలో అభివృద్ధికి సంబంధించి నల్లగొండ రూపురేఖలు మారుతాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోజ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ పాలకూరి సుమలత సంతోష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్ర శ్రీనివాస్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు గుండబోయిన వెంకన్న యాదవ్, మామిడి కార్తీక్, రేగట్ట లింగస్వామి గౌడ్, ఇటికాల శ్రీనివాస్, ఏదుళ్ళ శ్రీధర్ రెడ్డి, వజ్జ రమేష్ యాదవ్, ప్రదీప్ నాయక్, చిన్నాల జానయ్య, దీప్లా నాయక్, పిల్లి కృష్ణంరాజు, సట్టు శంకర్, జూలకంటి శ్రీనివాస్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

బయ్యారంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

- పట్టభద్రుల ఓటరు నమోదు, ఎన్నికల సన్నద్ధతపై నాయకులు, కార్యకర్తలతో చర్చించిన చాడ కిషన్ రెడ్డి

బయ్యారం అక్టోబర్ 30 నేటి వెలుగు:

మండల కేంద్రంలోని వి.బి.టి. ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాడ కిషన్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అంశాలు, పార్టీ బలోపేతం తదితర విషయాలపై నాయకులు, కార్యకర్తలతో ఆయన చర్చించారు. పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, ఎన్నికల సన్నద్ధతకు సంబం ధించి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశ ంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు పాల్గొన్నారు. పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎన్నికల సన్నద్ధతపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.



Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**